# దర్పం కొట్టిన దెబ్బ

*-కందుకూరి వెంకట మహాలక్ష్మి*

శ్రీనాథం గారు కాలుకాలిన పిల్లిలా ఇటు నుంచి అటూ అటు నుంచి యిటూ తెగ తిరిగేస్తున్నాడు. ఇది తప్పనిసరి- కానీ "తప్పితే బాగుండును" అనుకున్నాడు. ఈ పని చెయ్యాలంటే చాలా చిన్నతనంగా, నామోషీగా వుంది.

శ్రీనాథం గారు ఒక ప్రయివేటు కంపెనీలో జనరల్ మేనేజర్. ఆఫీసు ఆఫీసంతా చేతులు కట్టుకుని అతని ఎదుట నిలబడతారే తప్ప, అతనెప్పుడూ ఎవరికీ తలొంచలేదు. అతన్ని ఎవరన్నా ఏదన్నా కావాలని అడిగారే తప్ప, అతనెవర్నీ ఏదీ అడగలేదు. ఎవరినయినా పలకరిస్తే లోకువయిపోతానన్న దృష్టితో ఎవర్నీ విష్ చేసేవాడు కాదు. నమస్కారం సార్! అని ఎవరన్నా నమస్కారం పెట్టినా "ఊ" అనడమే గానీ ప్రతినమస్కారం చేసేవాడు కాదు. ఏ ఉద్యోగి చిన్న తప్పు చేసినా క్షమిస్తే తన స్ట్రిక్టునెస్, తన హోదాకి భంగం కలుకుతుందనే ఉద్దేశ్యంతో యింతని అంతచేసి వారిమీద మండిపడటం, సస్పెండ్ చేయించడమే కాకుండా కొందరి విషయాలలో ఉద్యోగాలు తీయించడం దాకా కూడా వెళ్ళేది. మరి అధికారి అలాంటి వాడయినప్పుడు క్రింద ఉద్యోగులు లోపల తిట్టుకుంటున్నా, ఆయన్ని చూసేసరికి నరాల నీరసం వచ్చినట్లో, వణుకు రోగం వచ్చినట్లో దడదడలాడిపోవడం సహజమే కదా?


అలాంటి శ్రీనాథం గారు అలా తిరిగెయ్యడంలో అర్థం ఆయన ఆలోచనలు తెగటం లేదనే కదా!

"ఎందుకండీ అంతలా ఆలోచిస్తారు? లోకంలో మీరొక్కరే ఈ పని చెయ్యవలసొచ్చినట్లు బాధపడుతున్నారేమిటి? ఆడపిల్ల తండ్రన్నాకా ఓరోజు కాకపోతే ఓరోజు తప్పదు. ఇదేమన్నా మీ ఆఫీసా? పెళ్ళి కొడుకుల తండ్రులు కూడా తలొంచుకుని మీ దగ్గరకి రావడానికి! అసలు పూర్వకాలం ఆడపిల్ల పెళ్ళి అంటే ఏడు చెప్పుల జతలరిగితే గానీ పెళ్ళి అవదనేవారు. కాలం ఎంత మారినా మన సంప్రదాయాలు కొన్నింకా మారలేదు కదా? పిల్లని చూడ్డానికి రమ్మనడమే అవమానమనుకుంటే రేపు కాళ్ళు కడిగి కన్యాదానం ఎలా చేస్తారండీ!" అంటూ గోల పెడుతున్న రాజ్యం వంక విసుగ్గా చూడటం తప్ప ఏమీ అనలేకపోయాడు.

మగపిల్లవాడు, మగపిల్లవాడంటూ మూడు కాన్పుల దాకా ఎదురు చూసిన శ్రీనాథం గారికి రెండేసేళ్ళ తేడాలో వరుసగా ముగ్గురాడపిల్లలు పుట్టినప్పుడు పడ్డ నిరుత్సాహం కన్నా పిల్లలు పెళ్ళికెదగగానే పెళ్ళి చెయ్యాలనీ, సంబంధాలు చూడమనీ రోజూ భార్య చేసే గొడవకి, ఒకరింటికెళ్ళి మా అమ్మాయిని మీ అబ్బాయికి చేసుకోండని అడగడమా? అనుకునేవాడు. తన జీవితంలో యింతవరకూ ఎవర్నీ, ఎప్పుడూ, ఏ విషయంలోనూ, దేనికీ చెయ్యిజాపి యాచించలేదు. "నేనేమిటి-ఒకరి నడగడమేమిటి?" అన్న అహం అతన్నీ విషయంలో తినేస్తోంది.

పెద్దపిల్లది పి.హెచ్.డి. కావస్తోంది. రెండో పిల్ల ఎమ్.కాం. మూడో పిల్ల బీ.ఎస్సీ. పూర్తి చేసి ఒకేసారి పెళ్ళికెదిగిపోయారు.

భర్త, పిల్లల పెళ్ళిళ్ళ గురించి పట్టించుకోకపోవడంతో రాజ్యమే కనిపించిన ప్రతివారితో "మా పిల్లలకి సంబంధాలుంటే చెప్పండ"ని అడగడం, వాళ్ళు ఏవో సంబంధాలున్నాయంటూ చెప్పడం, ఆ వివరాలు సాయంకాలం భర్త రాగానే ఏకరువు పెట్టి వెళ్ళి కనుక్కోమనడం ఆమెకి దినచర్య అయిపోయింది. అన్నీ విని వాటికి ఏవో వంకలు పెట్టేవాడు శ్రీనాథం గారు తప్పించుకునే ఉద్దేశ్యంతో! దాంతో "పెద్ద పిల్లకి పాతికేళ్ళు దాటిపోయాయి. యింకా




వయసొస్తే తగిన సంబంధాలు దొరక"వంటూ రాజ్యం- "టైమొస్తే అదే అవుతుం"దంటూ శ్రీనాధంగారూ!- "ఇలా కాళ్ళూ చేతులూ, ముడుచుక్కూర్చుంటే మీ కాళ్ళ దగ్గరకి ఎవరన్నా 'మీ పిల్లని చేసుకుంటాం' అంటూ వస్తారా?" అంటూ రాజ్యం- యిలా యిద్దరి మధ్యా రోజూ వాగ్వివాదం పరిపాటయిపోయింది.

శ్రీనాధం గారికిప్పుడు పిల్లల పెళ్ళిళ్ళే పెద్ద సమస్యగా, తలనొప్పిగా తయారయ్యాయి.

నిజానికి శ్రీనాధం గారికి ముగ్గురూ ఆడపిల్లలే అని బెంగపడవలసిన అవసరం లేదు. లక్షలకి లక్షలు పోసి అల్లుళ్ళని కొనగలడు. పిల్లలు బుద్ధిమంతులు, చదువుల సరస్వతులు, అందగత్తెలు కాకపోయినా అనాకారులు కాదు. ఇవన్నీ వున్నా శ్రీనాధం గార్ని యిబ్బంది పెడుతున్నదల్లా- పిల్లవాడింటికెళ్ళి "మా

## నానీలు

కన్నీటికి
కవిత్వాన్ని అడ్డం వేస్తే
చిరునవ్వుగా
నిలబడుతూంది

పాత్రలోని
మధువు స్వర్గం
దాని అంచే
నరకం

కోయిల
తోటని వర్ణించదు
రాగంతో
గుండెలోకి తీసుకుపోతుంది

వాన ఇంకిన నేల
పంటనిస్తే
లోకం ఇంకిన మనస్సు
కవిత్వాన్ని ఇస్తుంది

జీవన
రథచక్రాలకి
బ్రేకులు
నా జ్ఞాపకాలే

దేశ గౌరవం
జండాలలో లేదు
నిరుపేద
చెమటలో ఉంది

భక్తిని
మెదడులో తుడిచేస్తే
సమాజం
మనస్సులో ప్రతిఫలిస్తుంది

-జి. మాల్యాద్రి

అమ్మాయిని చేసుకొండని అడగడం ఎలా?" అన్నదే- తన తాహతుకి తగ్గవారెవరన్నా తనింటికొచ్చి "శ్రీనాధంగారూ! మీ అమ్మాయిల్ని మేం చేసుకోవాలనుకుంటున్నాం" అంటూ అడిగితే లక్షలు ఖర్చు చేసి పెద్ద ఎత్తున పెళ్ళి చేసి, ఘనంగా సారె చీరలతో పంపడానికి రెడీగా వున్నాడు. కానీ అలా ఎవరొస్తారు? అలా వచ్చే మార్గం ఏదన్నా వుందా? అన్నదే శ్రీనాధం గారి ఆలోచన. ఈ విషయాలు భార్య దగ్గరంటే చీవాట్లేస్తుందని తెలిసి, తెగ ఆలోచిస్తూ అలా తిరిగేస్తున్నాడు. 'వరుడు కావలెను' అని పేపర్లో ప్రకటిస్తేనో? అనుకున్నాడు కానీ తన పిల్లలకి పెళ్ళిళ్ళు అవక పేపర్లో వేయించాడని నలుగురూ అనుకుంటారేమో! అది నాకెంత అవమానం! అనుకుని ఆ ఆలోచనా మానుకున్నాడు. ఆఖరికి అతనికో మంచి మార్గం కనపడింది. మొత్తానికో పెళ్ళిళ్ళ పేరయ్యని పట్టి పెద్దపిల్ల వివరాలు, తన హోదా, డాబూ దర్పాలూ ఏకరువు పెట్టి మంచి సంబంధం వెతకమని అప్పగించాడు శ్రీనాధం గారు.

పెళ్ళి కొడుకుల యిళ్ళకెళ్ళి శ్రీనాధంగారు చెప్పిన గొప్పలకి మరింత మసాలా దట్టించి చెప్పి, వాళ్ళ వివరాలు రోజూ సాయంకాలాలు శ్రీనాధం గారింటికి చారేసేవాడు పెళ్ళిళ్ళ పేరయ్య. ఆ పెళ్ళి కొడుకుల లిస్టు చూసి తమ హోదాకి తగ్గవారు కారని కొందర్నీ చదువులు తక్కువని కొందర్నీ, ఉద్యోగాలు చిన్నవనీ తిరస్కరిస్తూ వచ్చాడు శ్రీనాధం గారు.

విసిగిపోని పెళ్ళిళ్ళ పేరయ్య తెస్తున్న సంబంధాలలో ఒకటి శ్రీనాధం గారికి చాలా నచ్చింది. పిల్లాడు ఐ.ఎ.ఎస్., ఎడిషనల్ సెక్రెటరీగా వుద్యోగం, ఒక్క తల్లి తప్ప అతనికింక సొంత వాళ్ళెవరూ లేకపోవడం- చాలా నచ్చింది. మగ దిక్కులేని వాడు, నా చెప్పు చేతల్లోనే పడి వుంటాడులే! అన్న ధీమా కూడా కలిగి ఆ సంబంధం చూడమన్నాడు. పేరయ్యా గారు పెళ్ళికూతురి ఫోటో, వివరాలతో వెళ్ళి మగపెళ్ళి వారికి అన్నీ చెప్పి పెళ్ళిచూపుల ఏర్పాటు చేయించాడు.

ఆధునిక భావాలు గల శ్యాం పిల్ల తండ్రి

ఇంటికొచ్చి పిలవాలన్న పట్టింపు లేదనీ, శ్రీనాధం గారు గురించి విన్నాననీ చెప్పి, మర్నాడు పేరయ్య గారి వెంట పెళ్ళి చూపులకి వెళ్ళాడు. శ్రీనాధం గారు పెళ్ళి చూపులకే పెళ్ళంత ఏర్పాటుచేసి పిల్లని చూపించాడు.

పిల్ల నచ్చిందనీ, కట్న కానుకల పట్టింపు లేదనీ, త్వరలోనే ముహూర్తాలు పెట్టించమని చెప్తూ, చివరగా "చిన్న కోరికండీ! మా తండ్రి గారు పోయాక మా అమ్మ ఎక్కడికీ రావటం లేదు, మీకు అభ్యంతరం లేకపోతే ఒక్కసారి మీరిద్దరూ మీ అమ్మాయిని తీసుకొచ్చి మా అమ్మగారికి చూపిస్తే సంతోషిస్తా"నని శ్యాం చెప్పగానే, వెంటనే 'ఓ అదెంత పనీ- రేపే తీసుకొచ్చి మీ అమ్మగారికి పిల్లని చూపిస్తాం' అంటూ శ్రీనాధం గారు శ్యాంని సాగనంపారు.

శ్యాం వెళ్ళిన దగ్గర నుంచీ శ్రీనాధం గారి కాలు నేల మీద, మనసు మనసులోనూ నిలవటం లేదు. ఇంట్లో కాలు బైట పెట్టకుండా, కానీ కట్నం యివ్వకుండా ఇంటికి పెద్దల్లుడిగా ఐ.ఎ.ఎస్. ఆఫీసరు వస్తున్నాడు. ఆఫీసులో ఎవ్వరికీ తలొంచనట్లే పెద్దపిల్ల పెళ్ళి విషయంలో కూడా తలొంచకుండా ఎవరింటికీ వెళ్ళి నా పిల్లని చేసుకోండని అడక్కుండా తన హోదాకి తగ్గ అల్లుడిని సంపాదించాడు. ఇక పెద్దల్లుడే మిగిలిన యిద్దరి పిల్లల పెళ్ళిళ్ళ విషయం చూసుకునేలా చెయ్యొచ్చు" అనుకున్నాడు. రేపు ఆఫీసులో అందరికీ ఈ విషయం తెలిసేలా చూడాలి అంటూ ఆనందం పట్టలేక పిచ్చివాడిలా యిల్లంతా తిరిగేస్తున్నాడు. సర్దిన సామానే మళ్ళీ సరుదుతున్నాడు. చెప్పినమాటే మళ్ళీ మళ్ళీ భార్యకి చెప్తున్నాడు. అప్పుడే పెళ్ళి ఏర్పాట్ల గురించి ఆలోచిస్తున్నాడు. ఎంతో ఘనంగా పెళ్ళి చేసి "శ్రీనాధం గారిలా ఎవ్వరూ చెయ్యలేరని" అనిపించుకోవాలని, ఊహాగానాల్లో పెళ్ళి పందిరి దగ్గర నుంచీ వేసేస్తూ, పెళ్ళి పన్లు కూడా ప్రారంభించేశాడు.

మర్నాడు నాలుగు రకాల పళ్ళు, నాలుగు రకాల స్వీట్లు, కాబోయే వియ్యపురాలికి పట్టుచీర, కాబోయే అల్లుడు శ్యాంకి సూటు గుడ్డ పట్టుకుని కూతురు శ్వేతతో కారులో శ్యాం యింటికి బయలుదేరారు శ్రీనాధం దంపతులు.

గేటు దగ్గరకెదురొచ్చి సాదరంగా ఆహ్వానించాడు శ్యాం. కాబోయే అల్లుడే ఎదురొచ్చి తీసుకెళ్తున్నందుకు ఎంతో ఆనందం, గర్వంతో హుందాగా లోపలికి నడిచాడు శ్రీనాధం. రాజ్యం, శ్వేతలు తిన్నగా లోపలి గదిలోకెళ్ళి శ్యాం తల్లి దగ్గర కూర్చున్నారు.

వంటవాడు తెచ్చిన కాఫీ టిఫిన్‌లు అయ్యాక శ్యాం శ్రీనాధంగారి వైపు తిరిగి "శ్రీనాధం గారూ! పెళ్ళికి ముందు మీకు మా కుటుంబం గురించి కొన్ని విషయాలు చెప్పదలిచాను. వివాహ విషయంలో వున్నదున్నట్లు చెప్పుకోడం, తెలుసుకోవడం మన రెండు కుటుంబాలకీ మంచిది. అన్నదానికి 'ఎందుకయ్యా మీ గత చరిత్ర! ప్రస్తుత విషయాలు మాకు బాగా నచ్చాయి- సరే- చెప్తానన్నావు చెప్పు!" అన్నారు నవ్వుతూ.

ఒకానొకప్పుడు మాది చాలా సామాన్యమైన కుటుంబం. మా నాన్నగారికి నేనొక్కడినే సంతానం. ఆయన ఒక కంపెనీలో అక్కవుంటెంటుగా ఉద్యోగం చేసేవారు. ఆ జీతంతోనే కాలం గడుపుతూ నన్ను పోస్టు గ్రాడ్యుయేట్‌ని చేశారు. చిన్నప్పటి నుంచీ నేను చదువులో ఫస్టే వచ్చే వాడిని. పి.జి.లో గోల్డు మెడలిస్టుని. కానీ ఆ మెడలు అలంకారానికే తప్ప భుక్తికి మార్గాన్ని చూపించలేదు. అలా నాలుగేళ్ళ పాటు నిరుద్యోగిగానే వుండిపోయాను. ఈ పరిస్థితుల్లో మా నాన్నగారి ఆఫీసులో చిన్న గొడవ వచ్చి మా నాన్నగారిని ఉద్యోగంలోంచి తీసెయ్యడమే కాకుండా, నలుగుర్లో అవమానించారు. నీతీ, నిజాయితీయే ప్రాణం కన్నా మిన్నగా భావించే మా తండ్రిగారా అవమానాన్ని తట్టుకోలేక కృంగిపోయి మంచం పట్టారు. వారి ఆఫీసులోనే ఓ పోస్టు ఖాళీ వచ్చి నేను ఇంటర్వ్యూకి వెళ్ళగా, ఇంటర్వ్యూ బోర్డులో ఫలానా వాడి కొడుకునన్న పేరు చూసి, "ఈ ఆఫీసులోనే ఉద్యోగం పోగొట్టుకున్న ఫలానావాడి కొడుకువా?" అని నన్నూ అవమానించి వుద్యోగం

యివ్వలేదు. ఆనాడు ఆ పెద్ద మనిషి నన్నలా అవమానించడమే నేనీనాడు ఐ.ఎ.ఎస్. ఆఫీసర్ని కావడానికి కారణమండీ! ఆయన మాటలకి మా నాన్నగారిలా నేను అవమానంతో క్రుంగిపోకుండా, పౌరుషం తెచ్చుకుని, ఇలాంటివారి అహాన్ని అణిచేలా అతనికంటే పెద్ద హోదాలోకి రావాలని శపథం పట్టి, బ్యాంకి లోన్‌తో పుస్తకాలు కొనుక్కొని ఐ.ఎ.ఎస్.కి కట్టి సెలక్టయ్యాను. కానీ మా ఆనందాన్ని పంచుకోకుండానే మా తండ్రిగారు బెంగతో పోవడం మాకు పెద్ద దెబ్బ. దేముడి లాంటి మా నాన్నగారు పోవడంతో మా అమ్మగారు చాలా క్రుంగిపోతున్నారు. ఆమెకి కాస్త తోడుగా వుండాలనే నేను పెళ్ళి చేసుకోవాలని

ఆయన మాటలకి మా నాన్నగారిలా నేను అవమానంతో క్రుంగిపోకుండా, పౌరుషం తెచ్చుకుని, ఇలాంటివారి అహాన్ని అణిచేలా అతనికంటే పెద్ద హోదాలోకి రావాలని శపథం పట్టి, బ్యాంకి లోన్‌తో పుస్తకాలు కొనుక్కొని ఐ.ఎ.ఎస్.కి కట్టి సెలక్టయ్యాను.

నిశ్చయించుకున్నాను" అంటూ చెప్పిన విషయాలు విని శ్రీనాధం గారు చాలా బాధపడిపోవడమే కాకుండా, శ్యాం కుటుంబానికి సానుభూతి తెలుపుతూ, శ్యాం నిజాయితీని మెచ్చుకుంటూ లేచి నిలబడి "మీ అమ్మగారిని నేనూ ఓసారి కలిసి ముహూర్తం గురించి చెప్పడం భావ్యం కదా! లోపలికి వెళ్దామా?" అన్నదానికి "తప్పకుండా- పదండి" అంటూ యిద్దరూ రాధమ్మగారి గదివైపుకి నడిచారు. ఆ గదిలోకెళ్ళిన శ్రీనాధం గారు శ్యాం తల్లిని పలకరించడం మర్చిపోయి, ఎదురుగా గోడకి పూలమాలతో అలంకరించి వున్న జగన్నాధం గారి ఫోటోనే కళ్ళంతా తెరిచి చూస్తూ శిలలా నిలబడిపోయాడు.

బుర్రలో సినిమా రీళ్ళలా ఆనాటి సంఘటన తిరగసాగింది.

"అయితే-అయితే! ఆరోజు నా ఆఫీసులో అక్కవుంట్లో రెండు వేలు తేడా వచ్చాయని నేను ఉద్యోగం తీసేసినప్పుడు 'నేనే పాపం ఎరుగను సార్!' అంటూ వేడుకుంటూ ఉద్యోగం తీసెయ్యవద్దని, కాస్త టైమిస్తే ఎక్కడన్నా అప్పుచేసి ఆ డబ్బు కట్టేస్తానని కాళ్ళా, వేళ్ళాపడి బ్రతిమాలుతూ, "ఈ ఉద్యోగం లేకపోతే నా కుటుంబం రోడ్డున పడిపోతుం"దని బ్రతిమాలినా కనికరించలేదు. సరికదా- ఆఫీసులో అందర్లో అవమానించి పంపేశాను. అంతే కాకుండా ఈ ఆఫీసులోనే శ్యాం సుందర్ ఇంటర్వ్యూకి వచ్చినపుడు అతనికి అన్ని అర్హతలు వున్నా "దొంగ కొడుకు" అంటూ అందర్లో అతన్ని అవమానించి ఆ ఉద్యోగం యివ్వకుండా చేసింది తనే! ఇవన్నీ తనకి యిప్పుడిప్పుడే గుర్తుకు వస్తున్నాయి.

మరిప్పుడు?

ఆ దొంగే తన వియ్యంకుడా??

ఆ దొంగ కొడుకే తన అల్లుడా??!

నిన్న ఆఫీసులో అందరికీ తనక్కాబోయే అల్లుడు ఐ.ఎ.ఎస్. ఆఫీసరని చెప్పేశానే! ఈ విషయం రేపు ఆఫీసులో తెలిస్తే?!

అయితే ఈ శ్యాం సుందర్ గాడు ఆ అవమానాన్ని గుర్తు పెట్టుకుని ఈరోజు యిలా తిరిగి చెప్పు దెబ్బ కొట్టాడా? అని ఆలోచిస్తున్న శ్రీనాధం గారి బుర్ర భూచక్రంలా తిరిగిపోసాగింది.

శ్యాం తల్లి శ్రీనాధం గారిని చూస్తూ "కూర్చోండి అన్నగారూ!" అంటున్నా కూర్చోలేక, అక్కడ నిలబడనూ లేక 'వెళ్ళొస్తాఘండీ!" అంటూ కారు వైపుకి గబగబా వెళ్ళిపోతున్న శ్రీనాధం గార్ని చూస్తూ, ఆయన చేస్తున్నదేమిటో అర్థం కాక రాజ్యం, శ్వేతలు వెంట నడవగా శ్యాంసుందర్ తల్లి మాత్రం "అకస్మాత్తుగా ఆయనలా ఏం మాట్లాడకుండా అలా వెళ్ళిపోతున్నారేమిటిరా?" అని అడుగుతున్న దానికి "సిగ్గుతో తలెత్తుకోలేకమ్మా!" అన్నాడు శ్యాంసుందర్ వెళ్ళిపోతున్న శ్రీనాధం గారిని వెటకారంగా చూస్తూ-

◉